# ముసలయ్య మరణం

★ వింత రామకృష్ణా రెడ్డి ★

ముసలయ్య మరణించాడని వినగానే గ్రామ ప్రజలందరూ జాలిపడ్డారు. అయితే ముసలయ్యను గురించి కాదు జాలి, అతనిచిన్న కోడలు సీతమ్మను గురించి. అదే అతని మరణములో వున్న విశేషము.

మూడేళ్ళనాటి సంగతి అప్పటికే అతని భార్య మరణించింది - తనజీవిత విధానానికి అడ్డు తగిలే కొడుకులతో వేరుపడాలని ఉద్దేశించాడు. ఉన్న ఆరెకరాలభూమి పంచాడు, ఇద్దరు కొడుకులకు నాలుగెకరాలు పోనూ తన వాటాకు రెండెకరాలు వచ్చినాయి.

అతనికి డబ్బుకూడబెట్టాలనే ఉద్దేశ్యములేదు. జీవితాన్ని తేలికగా గడపాలని, బ్రతికిన నాలుగు రోజులు సర్వభోగాలు అనుభవించాలనే అతని తత్వం, అందుకే అతను వేరుపడి తనవాటాకు వచ్చిన రెండెకరాలు అమ్ముకున్నాడు-

ఒక చిన్న గుడిసెలో అతని నివాసము. సమస్యలులేని జీవితం అతనిది. నాలుగు మెతుకులు తనే ఉడకవేసుకొని తింటున్నాడు. అయితే నీచులేనిదే కూడు లోపలికి పోదు. కోడిపందేలలోను గొర్రెల పోటీలలోను ఎక్కడజరిగినా తనే ప్రముఖవ్యక్తి.

రోజులు, మాసాలు గడిచినాయి. రెండు సంవత్సరాలయినది అతను వేరుపడి. అప్పులు చేయటం సాగించాడు. రెండెకరాలు అమ్ముకున్న వ్యక్తి- అతని దగ్గర డబ్బులేకపోవడమేమిటి? ఏదో అవసరమై అడుగుతున్నాడు అధిక వడ్డీ ఇస్తున్నాడు అందుకని శేషమ్మలాంటి స్త్రీలు పాలు, నేయి అమ్మిన డబ్బు వడ్డీకియిచ్చారు.

ముసలయ్యకు జబ్బుచేసింది, రెండురోజుల నుంచి లేవటంలేదు - ఒక్కసారిగా పెద్ద కోడలు సీతమ్మలో మార్పువచ్చింది. మామంటే ఎక్కడలేని అభిమానము పుట్టుక వచ్చింది. ఎక్కడలేని ప్రేమతో సపర్యలు చేయటం సాగించింది.

సీతమ్మ స్వభావము ఎవరికి తెలియదు? అందరికీ తెలుసు అందుకే అంతా అనుకున్నారు అప్పుడే "మామ చచ్చేటప్పుడు మిగిలిన డబ్బు తనకిస్తాడని ఆ అభిమానమూ ఆ ప్రేమాను''అని.

అక్షరాల అది నిజమే ముందు ముసలయ్యే అన్నాడు కోడలుతో- "సీతాం! నానూకలు అయిపోయినాయి ఇంకా ఎక్కువరోజులు బ్రతకనే ఈ చివరి ఘడియలలో నన్నెవరుచూస్తే వాళ్ళకే నాడబ్బిచ్చి ప్రాణాలు వదులుతానే" అని. సీతమ్మ తెలివి తక్కువదా చేతికివస్తున్న డబ్బును వదలుకోటానికి? ఎంతఖర్చుచేస్తే? ఎన్ని అప్పులు చేస్తే? రెండెకరాలుఅమ్మిన నాలుగువేలు అయిపోతయ్యా? 'ఏమైనా ఒక వేయి రూపాయలు మిగిలి వుంటాయి" అని ఉబ్బి పోయిందిసీతమ్మ తనఅదృష్టానికి.

సాగించింది సపర్యలు- అయినా ఒకరోజున అడిగి చూచింది మామను అమాయకంగా "నీవు పుటుక్కున చచ్చిపోతే యెట్లా? డబ్బెవరి దగ్గరో దాచావు ఇప్పుడే నాకివ్వరాదూ నేనునిన్ను చూస్తుంటాగా'' అని

ముసలయ్య మాత్రం తెలివి తక్కువవాడా? అతనూ అన్నాడు వెంటనే "ఇప్పుడే డబ్బు నీకిస్తే నన్ను నీవు సరిగ్గా చూస్తావని నమ్మకం ఏమిటి? అయినా ఇంకా నేనెన్నాళ్ళుబ్రతుకుతానే, నేనుచచ్చాక డబ్బు నీకివ్వమని ఆడబ్బు దాచిన దానితో చెప్పానులే'' అని.

ముసలయ్యకు జబ్బు తీవ్రమైంది చేయరాని నాగర్యంగా చేసింది కోడలు సీతమ్మ- అప్పుల వాళ్ళంతా ముసలయ్యచుట్టూ చేరారు.

'డబ్బెక్కడ దాచావు?' అని నిలదీసి అడిగారు- పాపము! ముసలయ్యనోరు పడిపోయింది. సైగలతో సంగతి చెప్పాడు తూర్పుదిక్కున గోనగిలో యున్నాడా తూర్పుదిక్కు అంటే మా 'యెంకప్ప' అయి వుంటుందని సీతమ్మ గబగబావెళ్ళి పిల్చుకవచ్చింది.

"నాకేమీ తెలియదే" అంది యెంకప్ప. ఆ వ్యక్తికాదని సైగచేశాడు ముసలయ్య- ఆదిక్కున అందరినీ అడిగారు - మాకివ్వలేదంటే మాకివ్వ లేదన్నారు - ఎవ్వరిని తీసుకవచ్చి చూపించినా ఆవ్యక్తికాదని సైగచేస్తున్నాడు ముసలయ్య.

అంతా నిరాశ చెందారు - "అంతా అబద్ధమై వుంటుంది, ఇంకెక్కడిడబ్బు అంతాతినేసే వుంటాడని"

సీతమ్మకు డబ్బివ్వకుండానే మరణించాడు ముసలయ్య - సీతమ్మకు దుఃఖం పొర్లుక వచ్చింది - మామ మరణించాడని కాదు - తాను చేసిన సవర్యలకు ఫలముచిక్కలేదని-

గుడిసెలో చెంబుతపాలాలైనా మిగిలినా యంటే వాటిని అప్పులవాళ్ళు పంచుకున్నారు- ముసలయ్య కొడుకులిద్దరూ చెరిసగము డబ్బు వేసుకొని కొద్దిలో దినము చేశారు-

సీతమ్మను చూచి గ్రామస్థులంతా జాలిపడ్డారు కాని సీతమ్మ తోడు కోడలు "నేను మొదటే అనుకున్నాను అంతాతినేసి వుంటాడు ఇంకా మిగలొచ్చిందా" అని, చాటుగా నవ్వింది సీత మ్మను చూచి-

# కేశసంపద

జి. వి. మైత్రేయి

ఒకడు పదేళ్ళ పిల్లాడిని కూడా తీసుకుని 'సెలూన్' కు వెళ్లాడు పిల్లాడిని ఒళ్లో కూర్చో పెట్టుకుని తాను క్షవరం చేయించుకున్నాడు, అంతా ఐన తర్వాత "ఈ పిల్లాడిక్కూడా క్రాఫ్ చేసెయ్ నేను పక్కహోటల్‌కు వెళ్ళి కాఫీత్రాగి చిల్లర మార్చుకవస్తా" అని మంగలాడితో చెప్పి వెళ్ళి పోయాడు.

పిల్లాడికి క్రాఫ్ చెయ్యడం ఐంది. ఆ వెళ్లిన వాడు ఇంకా తిరిగి రాలేదు. ముప్పావు గంట యింది, ఒకగంటయింది, అప్పటికీ రాలేదు. పిల్లాడు ఏడవటం ప్రారంభించాడు.

మంగలాడు "ఏడవకురా అబ్బాయి! మీనాన్న త్వరగా వచ్చేస్తాడులే" అన్నాడు.

పిల్లాడు ఏడుస్తూ "ఆయన మానాన్నకాదు, వీధిలో ఆడుకుంటూ వుంటే ''రా అబ్బాయి క్రాపు చేయించుకుందాం" అని చెప్పి పిలుచు కొచ్చాడు'' అంటూ ఇంకా ఏడవటం మొదలు పెట్టాడు.

